తిర్మలాపురం శివారులో భారీ పేలుళ్లు

- మిరపతోటలో ఎగిరిపడ్డ రాళ్లు
- ఇళ్ల గోడలకు పగుళ్లు

పేలుళ్లతో మోద్గులగూడెంలో ఇంటికి పడిన బీటలు చూపుతున్న యజమాని

కురవి, జనవరి 10: మండలంలోని తిర్మలాపురం శివారు గుట్టల్లో భారీ బ్లాస్టింగ్‌లతో చుట్టుపక్కల గ్రామాల ప్రజ లు, గుట్టచుట్టూ భూములు ఉన్న రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. గురువారం రాత్రి భారీ పేలుడు జరగ్గా ప్రజలు తీవ్రంగా భయపడ్డారు. గ్రామ శివారులో ప్రభుత్వ భూమిని లీజుకు ఇచ్చారు. మైనింగ్ అధికారులు సైతం అనుమతులు ఇచ్చారు. సామార్థ్యానికి మించి భారీగా విస్ఫోటనాలు, శబ్దాలు వస్తుండడంతో రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. గురువారం రాత్రి భారీ పేలుడు దాటికి పెద్దరాళ్లు ఎగిరి చుట్టుపక్కల రైతుల తోటలలో పడ్డాయి. గతంలో పలుమార్లు ఇలాగే జరిగిన ఘటనలు ఉన్నాయని రైతులు వాపోయారు. కూలీలు పనిచేసే సమయంలో రాళ్లు పడితే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీకి సమీపంలో ఉన్న మొద్దులగూడెం, నల్లెల్ల గ్రామాల్లో కొందరి ఇళ్ల గోడలు పేలుళ్లకు బీటలు వచ్చాయి. పేలుళ్లపై మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మోడల్ ఇందిరమ్మ ఇల్లుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం/గార్ల, జనవరి 10: బయ్యారం మండలంలోని 27మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు తహసీల్దార్ విజయ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. గార్ల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులు, మోడల్ ఇందిరమ్మ ఇల్లుకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో మంగమ్మ, తహసీల్దార్ రవీందర్, ఆర్ఐ స్వప్న పాల్గొన్నారు.

బయ్యారం కాంగ్రెస్‌లో విభేదాలు

బయ్యారం: మండలంలోని కాంగ్రెస్ పార్టీలో విభేదాలు బహిర్గతమయ్యాయి. ఓ వర్గానికి చెందిన నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరో వర్గంపై ఆరోపణలు చేశారు. ఆ పార్టీకి చెందిన మండల నాయకుడు రామ్మూర్తిని సస్పెన్షన్ చేస్తున్నట్లు పార్టీకి చెందిన బాలజీపేట గ్రామ అధ్యక్షుడు శ్రీను ప్రకటించగా, మండల అధ్యక్షుడు ముసలయ్య సమర్థించడంపై రామ్మూర్తితో పాటు సోమేశ్, శ్రీనివాస్, రవినాయక్ మండిపడ్డారు. మండల అధ్యక్షుడు కొందరికి తొత్తుగా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. అయితే ఇరువర్గాల నాయకుల తీరుపై ఎమ్మెల్యే కోరం కనకయ్య అసహనం వ్యక్తం చేశారు. ఓ వర్గం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన సమయంలో మండల పర్యటనలో వెళ్తూ ఆగి విషయం తెలుసుకున్నారు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు

నెల్లికుదురు: కందకం తవ్విస్తున్న తహసీల్దార్, ఎస్సై

నెల్లికుదురు, జనవరి 10: ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కే రాజు, ఎస్సై చిర్ర రమేశ్‌బాబు హెచ్చరించారు. మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి శివారు మామిడితోట వద్ద శుక్రవారం తహసీల్దార్, ఎస్సైలు కందకాలు తవ్వించారు. వారు మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా నివారించేందుకు కందకాలు తవ్వించినట్లు తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

చిన్నగూడూరు/నర్సింహులపేట: చిన్నగూడూరు మండల కేంద్రం శివారు వ్యవసాయ భూముల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 15 ట్రిప్పుల ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. తహసీల్దార్ మహబూబ్‌అలీ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. నర్సింహులపేట మండలం కొమ్ముల వంచలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 ట్రాక్టర్ల ఇసుక డంప్‌తోపాటు రెండు ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఇసుక రవాణా అడ్డుకునేందుకు తీసిన ట్రెంచ్‌లు పూడ్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 10 : పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా చదువుతూ జిల్లాలో మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించాలని సూచించారు. రామసహాయం వెంకట్‌రెడ్డి, చాడ అశోక్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాజేశ్వరరావు, స్కూల్ హెడ్‌మాస్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెద్దవంగర: హైస్కూల్‌లో ముగ్గులు పరిశీలిస్తున్న టీచర్లు

మరిపెడ: ముగ్గులను వేస్తున్న విద్యార్థులు

నెల్లికుదురు: శ్రీరామగిరిలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

పాఠశాలల్లో సంక్రాంతి సందడి

- ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు
- విజేతలకు బహుమతుల ప్రదానం

డోర్నకల్: మన్నెగూడెంలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

తొర్రూరు/ పెద్దవంగర /డోర్నకల్/ నెల్లికుదురు/ మరిపెడ/చిన్నగూడూరు, జనవరి 10: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి వేడుకలు సందడిగా జరిగాయి. విద్యార్థులు భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతలను తెలిపేలా ముగ్గులు వేశారు. గంగిరెద్దులు, హరిదాసుల వేషధారణల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. పాఠశాలలో భోగి మంటలు వేశారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. డోర్నకల్ మండలం మన్నెగూడెం జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు మాజీ ఎంపీటీసీ విజయ్‌పాల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. హెచ్ఎం విత్తనాల సుధాకర్, ఉపాధ్యాయులు ఇందిర రాణి, ప్రశాంతి, విక్టోరియా, మాధవి పాల్గొన్నారు. నెల్లికుదురు మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మరిపెడ మండల కేంద్రంలోని సీతారాంపురం, మరిపెడ పాఠశాలల్లో ముగ్గుల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హెచ్ఎం అర్జున్, స్టాఫ్ సెక్రటరీ బయగాని రామ్మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిన్నగూడూరు మండలంలోని పాఠశాలల్లో ముగ్గుల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. చిన్నారులకు భోగిపండ్లు పోసి ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన రిషిక క్లాసికల్ డాన్స్, సాత్విక జానపద నృత్యం, మెహరతి పోస్టర్ పెయింటింగ్ విభాగంలో ప్రతిభ కనబరిచారు. వారిని అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం తిరుమలలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, కుటుంబ సభ్యులు – మహబూబాబాద్ రూరల్, జనవరి 10

కత్తితో బావమరిదిపై బావ దాడి

గాయాలపాలైన రాములు

కొత్తగూడ, జనవరి 10: బావమరిదిపై బావ కత్తితో దాడి చేసిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో శుక్రవారం సంత ఉండగా బోళ్ల వ్యాపారం చేసే బావ, బావమరుదులు ఒకరి స్థలంలో మరొకరు దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఇద్దరు గొడవకు దిగి, నర్సంపేటకు చెందిన రాముపై ముత్తోజిపేటకు చెందిన బావ సదానందం కత్తితో వెనుక భాగంలో పొడిచాడు. దీంతో బావమరిది రాములు తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు ప్రాథమిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిన్నారు. పోలీసులు బావ సదానందంను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

యువత వ్యాపారాల్లో రాణించాలి

మరిపెడ, జనవరి 10: యువత వ్యాపారాల్లో రాణించాలంచాలని, అందుకు లాభ నష్టాలను ఎదుర్కోవాలని స్పెషల్‌క్లాస్ కాంట్రాక్టర్ నారెడ్డి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గాలివారిగూడెంలో కిరాణా షాపును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు గురికాకుండా స్వతంత్రంగా ఆర్థికంగా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎడెల్లి మహేశ్, మహితి, నారెడ్డి కవిత, నారెడ్డి శేఖర్‌రెడ్డి, నారెడ్డి రాంరెడ్డి, ఈదుల మహేశ్వరి, ప్రభాకర్, లావణ్య, సురేష్, వెంకన్న, సతీష్, కృష్ణ, జ్యోతి, లలిత పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

తొర్రూరు, జనవరి 10: రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఏవో భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటల్లో యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. యూరియాను రైతులు తగిన మోతాదులో వాడితే చాలా మంచిదన్నారు. ఏఈవోలు వినయ్‌వర్మ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి
- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తొర్రూరు, జనవరి 10: ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధవహించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. శుక్రవారం పెద్ద వంగర, తొర్రూరు మున్సిపాలిటీలో విస్తృతంగా పర్యటించారు. తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ (బాలికలు) ప్రభుత్వ బాలికల ఉన్నత సాంఘిక సంక్షేమ శాఖ (బాలికలు) వసతిగృహం, కాలేజీ, మహాత్మా జ్యోతిరావు పూలే టీబీసీడబ్ల్యూఆర్, స్కూల్ (బాయ్స్) లలో ఆకస్మికంగా తనిఖీ చేసి వసతిగృహాలు, కాలేజీలు, పాఠశాలలో పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్‌లను రుచికరంగా ఏర్పాటు చేయాలని సూచించారు.

కిలోన్నర గంజాయి పట్టివేత.. ఇద్దరి రిమాండ్

కురవి, జనవరి 10: గంజాయి తరలిస్తుండగా పట్టుకొని ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద ఎస్సై గంధ్రాతి సతీష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన కట్ల ఉమేశ్ ద్విచక్ర వాహనంపై తిరుగుతుండగా పట్టుకున్నారు. తనిఖీ చేయగా అతడి వద్ద బ్యాగులో కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహబూబాబాద్ మండలం మాదాపురం తూర్పుతండాకు చెందిన ఆంగోత్ రాములు వద్ద గంజాయి తీసుకుని చిన్న పొట్లాలు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిపాడు. కిలోన్నర గంజాయి (రూ.45వేల విలువ), బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. కట్ల ఉరమేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ పంపగా, శుక్రవారం ఆంగోత్ రాములును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. రాములుపై గతంలో నాలు గు గంజాయి కేసులు ఉన్నట్లు తెలిపారు. తనిఖీల్లో పాల్గొన్న ఏఎస్ఐ వెంకన్న, హెచ్‌సీ వెంకటయ్య, పీసీ భద్రు, నరేష్, హరిబాబు, గణపతిను అభినందించారు.

రేపు టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర సమావేశం

మహబూబాబాద్ రూరల్, జనవరి 10 : ఈనెల 12న టీబీఎస్ఎస్ఎస్ (తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య) రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని పట్టణంలోని పీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ కోశాధికారి కొండపల్లి కేశవరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నట్లు తెలిపారు. అర్చకుల సమస్యలతో పాటు రాష్ట్రంలో బ్రాహ్మణుల సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. అతిథులుగా తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కల్లూరి ప్రభాకర్, టీబీఎస్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు రంగావఝ్ఝుల సుధాకర్‌శాస్త్రి, శ్యాంసుందర్‌శర్మ పాల్గొన్నారు.

మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు

కేసముద్రం, జనవరి 10: సంక్రాంతి పండుగ సందర్భంగా ఐదు రోజులు మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 15 వరకు సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. ఈనెల 16న తిరిగి మార్కెట్ ప్రారంభమవుతుందని తెలిపారు.

బీసీజీ వ్యాక్సిన్ వేసేందుకు సర్వే

మరిపెడ, జవనరి 10: టీబీని అంతం చేసే వయోజన బీసీజీ వాక్సిన్ వేసేందుకు మండలంలో సర్వే చేసినట్లు డాక్టర్ రవి తెలిపారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షయ (టీబీ) వ్యాధి నిర్ధారణ కోసం 2వారాలపాటు తగ్గని దగ్గు, జ్వరం ఉన్న వారి నుంచి తెమడ 81శాంపిల్స్ సేకరించినట్లు తెలిపారు. వాటిని జిల్లా కేంద్రానికి పంపి టీబీ అని నిర్ధారణ అయితే ఆరు నెలలు ఉచిత చికిత్స, రూ.500 పారితోషకం ఇవ్వనున్నట్లు వివరించారు. ప్రతి నెల 70మందికి టీబీ మందులు ఇస్తున్నట్లు చెప్పారు. ల్యాబ్ టెక్నీషియన్ అనిత, రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రెడ్యా పరామర్శ

నివాళులు అర్పిస్తున్న రెడ్యానాయక్

దంతాలపల్లి, జనవరి 10: మండల కేంద్రంలోని బాధిత కుటుంబాన్ని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పరామర్శించారు. గ్రామానికి చెందిన డీలర్ తాడ గుట్టారెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం పార్థివదేశంపై రెడ్యానాయక్ పూలమాల ఉంచి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు వొలాద్రి మల్లారెడ్డి, వీరబోయిన కిశోర్‌కుమార్ ఎల్లు కృష్ణారెడ్డి, వెంకన్న, శ్రవణ్, ఉమేశ్ ఉన్నారు.

ఎంట్రెన్స్ టెస్ట్ బుక్స్ పంపిణీ

బుక్స్ పంపిణీ సీఐ బాబురావు

కొత్తగూడ, జనవరి 10: మండల కేంద్రంలోని ఓటాయిలో ఎంపీపీఎస్‌లో నాలుగో తరగతి, ఐదో తరగతి విద్యార్థులకు గురుకుల ఎంట్రెన్స్ టెస్ట్, నవోదయ ఎంట్రెన్స్ టెస్ట్ బుక్స్ గూడూరు సీఐ కోటబాబురావు పంపిణీ చేశారు. జడ్పీ హైస్కూల్‌లోను సందర్శించి ప్రసంగించారు. పదోతరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. రోజూ దినపత్రికలు చదవాలన్నారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రమాదేవి, స్థానిక ఎస్సై కుశకుమార్, గంగారం ఎస్సై రవికుమార్, బానోత్ రూప్‌సింగ్, వల్లెపు రంజిత్ పాల్గొన్నారు.

గుజిలితండా పాఠశాల సందర్శించిన ఎంఈఓ

కురవి, జనవరి 10: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామ పంచాయతీ శివారు గుజిలితండా ప్రాథమిక పాఠశాల ఈనెల 18వ తేదీన పునఃప్రారంభం కానున్నందున పాఠశాల భవనాన్ని సీరోలు ఎంఈఓ ఇస్లావత్ లచ్చిరాంనాయక్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని కోరారు. సుమారు 15మంది విద్యార్థులు ఈ పాఠశాలకు వచ్చేదుకు సుముఖత వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీరోలు మండల ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు, నాయకులు బాదావత్ సిరినాయక్, తులిస్యా, శ్రీను, కొంపెల్లి మల్లయ్య, భద్రు, అంగన్‌వాడీ టీచర్ జాటోత్ సరిత, ఆయా ప్రమీల పాల్గొన్నారు.

టీజీఓస్ క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

డోర్నకల్, జనవరి 10: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ కృష్ణవేణి చేతులమీదుగా ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆధికారుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. పశు వైద్యాధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు, డీటీ వీరన్న పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు చేయూతనందించాలి

తొర్రూరు, జనవరి 10: చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ చేయూత అందించి సహకరించాలని చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి కోరారు. శుక్రవారం డీఎస్పీ, ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీ కృష్ణకిషోర్ మాట్లాడుతూ బాలలే భవిష్యత్ సమాజ పునాదులన్నారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నిర్వహించే కార్యక్రమాల్లో తమ వంతు సహకారాన్ని అందిస్తామన్నారు.

ఉద్యోగ విరమణ వయసు పెంచొద్దు

పెద్దవంగర/గార్ల, జనవరి 10: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయసు పెంచొద్దని టీపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం టీపీటీఎఫ్ పెద్దవంగర మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్, గార్ల మండల అధ్యక్షుడు యాదగిరి ఆయా మండల కేంద్రాల్లో మాట్లాడారు. నిరుద్యోగులు ఏళ్లుగా ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తుండగా, ఉన్న ఉద్యోగుల వయసు పెంపు నిర్ణయం అనైతికమన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత గ్రాట్యూటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్కాష్‌మెంట్, జడ్పీ జీపీఎఫ్ ఫైనల్ పేమెంట్స్ చెల్లించలేక ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటోందని విమర్శించారు. గార్లలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ బాలాజీ, హనుమంతు, వెంకటరెడ్డి, సంతు, రామనాథం, రమేశ్ పాల్గొన్నారు.

'కక్ష సాధింపులకు పాల్పడుతున్న రేవంత్ ప్రభుత్వం'

మాట్లాడుతున్న సురేశ్

చిన్నగూడూరు, జనవరి 10: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు బాదావత్ సురేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఫార్ములా ఈ కార్ రేస్‌లో కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించే కుట్రలను విరమించుకుని, ప్రజాపాలనపై దృష్టిసారించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. నెలకు రూ.15వేలు రైతుభరోసా ఇస్తామని, రూ.12వేలు ఇస్తామంటూ రైతులను మోసం చేస్తోందన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు రఘు, నరేశ్ ఉన్నారు.

రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

నర్సింహులపేట, జనవరి 10: గ్రామ పంచాయతీ రికార్డులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీపీవో హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జీపీలో రికార్డులు, కౌసల్యదేవిపల్లిలో నర్సరీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించి, పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామ రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇంటిపన్నులు 100శాతం వసూలు చేయాలని సూచించారు. ఎంపీడీవో మాధవి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, సాత్విక్, సాయి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE
★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును.
No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములలో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

యువత క్రీడలపై దృష్టిసారించాలి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీతారాంరెడ్డి

మహబూబాబాద్ రూరల్, జనవరి 10 : యువత క్రీడలపై దృష్టిసారించాలని జాయింట్ ఫ్యామిలీ ట్రస్ట్ చైర్మన్ నామిరెడ్డి సీతారాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జమాండ్లపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేడు క్రీడలకూ ప్రాముఖ్యత ఉందన్నారు. క్రీడల్లో ప్రతిభ ఉన్న వారికి విద్య, ఉద్యోగాల్లో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. సింగంశెట్టి బాబురావు, కుక్కమూడి వెంకన్న, మహేందర్‌రెడ్డి, పాపాచారి, రమేశ్, నవీన్, నరేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి టెక్నికల్ కోర్స్ సర్టిఫికెట్ పరీక్షలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 10 : జిల్లాలో టెక్నికల్ కోర్స్ సర్టిఫికెట్ పరీక్షలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో జడ్పీ హైస్కూల్‌లో టైలరింగ్, ఎంబ్రాయిడరీ, లోయర్, హయ్యర్ పరీక్షలకు క్లాత్ సప్లై చేస్తామని, ఇతర మెటీరియల్స్ అభ్యర్థులు తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకుకు 9849761012 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

గార్ల, జనవరి 10: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నల్లమల గిరిప్రసాద్ భవనం వద్ద సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలన్నారు. రైల్వేలైన్ కింద భూమి కోల్పోతున్న రైతులకు పరిహారం అందించాలన్నారు. రాంపారం పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. జంపాల వెంకన్న, రాగం రమేశ్, వీరయ్య, భిక్షమయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీ